# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 21-03-2026 సమయం : సాయంకాలం 6గం.10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రంజాన్ పండుగను పురస్కరించుకొని ముస్లిం సోదరులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు.

- ❖ భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం త్వరలో ప్రారంభమవుతుందని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు.

- ❖ రాష్ట్రంలో పశుసంవర్ధక రంగాన్ని బలోపేతం చేసే చర్యలను చేపడుతున్నామని మంత్రి కె.అచ్చెన్నాయుడు అన్నారు.

- ❖ పాలు, నెయ్యి, నూనె, ముడిసరకుల నాణ్యత తెలుసుకునేందుకు తిరుమలలో ల్యాబ్ ఏర్పాటు చేసినట్లు మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు.

======================

రంజాన్ పండుగను పురస్కరించుకొని ముస్లిం సోదరులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ నెలలో ఉపవాసదీక్షలు, ప్రార్థనలు మనసును పవిత్రం చేసుకోవడానికి, మంచి మార్గంలో నడవడానికి, పరస్పర ప్రేమాభిమానాలను పెంపొందించడానికి ఒక మంచి అవకాశాన్ని కలిగిస్తాయని, ఈ రంజాన్ జీవితంలో ఆనందం, శాంతి, ఆరోగ్యం, ఐశ్వర్యం నింపాలని ఆకాంక్షిస్తున్నానని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఇస్లాం ధర్మాన్ని అనుసరించే వారు రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు ఆచరించి ఈద్-ఉల్-ఫితర్ వేడుక చేసుకుంటున్నారని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ పేర్కొంటూ.. రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

======================

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం త్వరలో ప్రారంభమవుతుందని పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. విశాఖపట్టణంలో సి.ఐ.ఐ ఆధ్వర్యంలో ఈరోజు జరిగిన స్వర్ణాంధ్ర ప్రదేశ్ సదస్సులో కేంద్రమంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. స్వర్ణాంధ్ర-2047 సాధనకు కేంద్ర ప్రభుత్వం పూర్తి తోడ్పాటు

అందిస్తున్నదని అన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిలో సీఐఐ ముఖ్య భూమిక పోషిస్తుందని తెలిపారు. కొత్తవలస - కిరండూల్ (కేకే) రైల్వేలైన్ కోసం ఇంకా చర్చలు జరుగుతున్నాయని, విశాఖ రైల్వే జోన్ ప్రధాన కార్యాలయం నిర్మాణం జరుగుతోందని వెల్లడించారు. ఈనెల 23న మిట్టల్ స్టీల్ ప్లాంట్‌కు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేస్తారని తెలిపారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వ హయాంలో ఉత్తరాంధ్ర అభివృద్ధి శరవేగంగా సాగుతోందని రామ్మోహన్ నాయుడు తెలియజేస్తూ...

(వాయిస్ 29 సెకన్లు)

=====================

డిమాండ్ ఉన్న పంటలకు రైతులు ప్రాధాన్యత ఇవ్వాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ రైతులకు సూచించారు. గుంటూరు జిల్లా కొర్నెపాడులో ఈ రోజు జరిగిన ఒక కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ... వ్యవసాయానికి పూర్వవైభవం రానున్నదని, రైతులు మార్కెట్ ను గమనిస్తూ పంటలు వేయాలన్నారు. ప్రభుత్వ గిడ్డంగుల సౌకర్యాలను ఉపయోగించుకొని.. ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని కోరారు.

=====================

రాష్ట్రంలో పశుసంవర్ధక రంగాన్ని బలోపేతం చేసే చర్యలను చేపడుతున్నట్లు వ్యవసాయం, పశుసంవర్ధక శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఈ రోజు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల పరిధిలో డెయిరీ ఫారాలు, గొర్రెలు, మేకల పెంపకం కేంద్రాలు, పందుల పెంపకం యూనిట్లు, ఇతర పశుసంవర్ధక క్షేత్రాలకు అభివృద్ధి పన్నుల నుండి పూర్తిగా మినహాయింపు ఇస్తూ.. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ఉత్తర్వులను జారీ చేసినట్లు వెల్లడించారు. ఈ క్షేత్రాల భవన అనుమతి, లైసెన్స్ రుసుమును గ్రామ పంచాయతీల్లో వసూలు చేసే రుసుముకు సమానంగా నిర్ణయించినట్లు స్పష్టం చేశారు. ఈ నిర్ణయంతో పట్టణ ప్రాంతాల్లో పశుపోషణపై ఆధారపడిన రైతులకు ఆర్థిక భారం తగ్గి.. జీవనోపాధి మెరుగుపడుతుందని, మరింత మందికి స్వయం ఉపాధి, సమృద్ధి లభిస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

విరామం

=====================

పాలు, నెయ్యి, నూనె, ముడిసరకుల నాణ్యత తెలుసుకునేందుకు తిరుమలలో ల్యాబ్ ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. తిరుమలలో ఆయన ఈ రోజు పాత్రికేయులతో మాట్లాడుతూ... ఈ ల్యాబ్ ను 25 కోట్ల రూపాయల వ్యయంతో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేశామన్నారు. మూడు నెలల్లో గుంటూరు, విశాఖలో ఇటువంటి ల్యాబ్‌లు ప్రారంభించాలని ప్రణాళికలు వేస్తున్నామని, నాణ్యతలో రాజీపడబోమని మంత్రి స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో రాష్ట్ర వ్యాప్తంగా 11 ల్యాబ్స్‌ను ఆధునీకరించనున్నట్లు సత్యకుమార్ యాదవ్ పేర్కొంటూ...

(వాయిస్ 27 సెకన్లు)

=====================

ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తామని ఆ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. విశాఖపట్టణంలో ఈ రోజు ఒక కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... విశాఖపట్టణం ప్రపంచ నగరంగా ఎదుగుతున్న తరుణంలో నూతనంగా నిర్మాణం అవుతున్న స్టార్ హోటల్స్ పర్యాటక రంగానికి వెన్నెముకగా నిలవనున్నాయని పేర్కొన్నారు. వీటి వల్ల నగర ముఖచిత్రం మారుతుందని, స్థానిక యువతకు ఆతిథ్య రంగంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. విశాఖ నగరానికి వస్తున్న జాతీయ, అంతర్జాతీయ పర్యాటకుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో వారి అభిరుచులకు తగ్గట్టుగా వసతి సౌకర్యాల కల్పన జరగడం చాలా అవసరమన్నారు.

=====================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 132వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 27వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

=====================

రాష్ట్రంలో పాల కల్తీ అరికట్టే చర్యల్లో భాగంగా పాల వ్యాపారులు తప్పనిసరిగా ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (FSSAI) గుర్తింపు పొందాలని ఎన్టీఆర్ జిల్లా పశుసంవర్ధక శాఖ సంచాలకులు డాక్టర్ టి. దామోదర్ నాయుడు ఈ రోజు ఒక ప్రకటనలో తెలిపారు. పశుసంవర్ధక శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి.. తనిఖీలు నిర్వహిస్తారని, నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటారని ఆయన స్పష్టం చేశారు.

=====================

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కల్పన విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 31న కుప్పంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు చిత్తూరు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం. గుణశేఖర్ రెడ్డి ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాకు 33 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరయ్యి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

=====================

ఉత్తర కోస్తాంధ్రప్రదేశ్ తీరప్రాంత పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో సగటు సముద్ర మట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తులో నిన్నటి నుండి విస్తరించిన ఉపరితల ఆవర్తనం ఈరోజు తక్కువగా గుర్తించబడినదని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ఫలితంగా ఉత్తర కోస్తాంధ్రప్రదేశ్ లో ఈరోజు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు పలు చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి ఎం. వెంకట్రావు తెలియజేస్తూ...

(వాయిస్ 20 సెకన్లు)

=====================

రాష్ట్రంలో పలు జిల్లాలకు పిడుగుపాటు హెచ్చరిక ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎం.డి ప్రఖర్ జైన్ తెలిపారు. అల్లూరి, పోలవరం, కాకినాడ, తూర్పుగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురుస్తాయని.. విశాఖ, అనకాపల్లి, నెల్లూరు, వైఎస్ఆర్ కడప జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు ఉంటాయని ఆయన వెల్లడించారు.

=====================
=====================